ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శనివారం 13 జూలై 2024

అక్రమార్కుల గుండెల్లో గుబులు

- వైసీపీతో అంటకాగిన రెవెన్యూ అధికారుల్లో భయం
- నేతలను ఆశ్రయిస్తూ.. అభయం కోరుతూ..
- మదనపల్లె, తంబళ్లపల్లెలో ఇదీ పరిస్థితి

గత పాలనలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారుల్లో గుబులు పట్టుకుంది. వైసీపీ పెద్దలు, చోటామోటా నేతలు చెప్పినట్లు తలాడించి, అడ్డూ అదుపూ లేకుండా అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామనే ప్రభుత్వ సంకేతాలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎటొచ్చి తమ మెడకు చుట్టుకుంటుందోనని అటు రెవెన్యూ, ఇటు విద్యుత్తు శాఖ అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఊపిరుంటే ఉప్పు అమ్ముకుని బతికేయవచ్చనే సామెతను గుర్తు చేసుకుంటూ ఆందోళన చెందుతున్నారు. కనీసం బదిలీ చేసినా పర్వాలేదని, మరోచోటికి వెళ్లి ఉద్యోగం చేసుకోవచ్చని.. వివిధ కారణాలు చూపుతూ సస్పెండ్ చేస్తే పరిస్థితి ఏంటని మదనపడుతున్నారు. ముఖ్యంగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అధికారుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది.



మదనపల్లె బైపాస్‌రోడ్డు ఆనుకుని బి.కె.పల్లెలో ఆక్రమించి కంచె వేసిన విలువైన భూమి

మదనపల్లె, జూలై 12: జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో రెవెన్యూశాఖలో అక్రమాలు ఎక్కువగా జరిగాయి. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం నుంచి నిన్నటి ఫ్రీహోల్డ్ పథకం వరకు అడుగడుగునా అవినీతి, అక్రమాలే చోటుచేసుకున్నాయి. అధికారమే అండగా పెద్దలే కాదు.. వైసీపీ చోటామోటా నేతలు చెప్పినట్లు అధికారులు ఇష్టానుసారం చేసేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూములే కాదు.. ప్రైవేటు భూములు కూడా కబ్జాతో పాటు ఆక్రమణకు గురయ్యాయి. ముఖ్యంగా మదనపల్లె పట్టణం చుట్టూ ఉన్న ప్రభుత్వ, డీకేటీ భూములు ఈ జాబితాలో ఉన్నాయి. అప్పటి అధికార వైసీపీలోని పెద్దలు, వారి అనుయాయుల అధీనంలోకి వెళ్లాయి. ఇందుకు వీఆర్వో నుంచి జిల్లా అధికారుల వరకు స్వామి భక్తి చాటుకుంటూ సంపూర్ణ సహకారం అందించారు. నకిలీ రికార్డులు, మిలటరీ పట్టాల పేరుతో రికార్డులు సృష్టించి పెద్దల సహకారంతో కలెక్టర్ నుంచి ఎన్‌వోసీలు పొందారు. ఇందులో వైసీపీకి అనుకూలంగా ఉన్న రియల్టర్లు కూడా భాగస్వాములయ్యారు. ఈ క్రమంలో బసినికొండ, వలసపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలోని పుంగనూరురోడ్డు వెంబడి భూముల రికార్డులు మార్చేశారు. ఇందులో ఒక్కో ఎన్‌వోసీకి రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు చేతులు మారినట్లు చెబుతున్నారు. అంటే ఏ స్థాయిలో ఇక్కడ అక్రమాలు జరిగాయో అంచనా వేయవచ్చు. అలాగే ప్లాట్లు, లేవుట్ వేసే స్థలంలో విస్తీర్ణాన్ని బట్టి, కుంటల నుంచి మొదలై ఎకరా వరకు భూమి రాయించుకొని కార్యాన్ని చక్కదిద్దినట్లు విమర్శలున్నాయి. ప్రస్తుతం ఆ భూముల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి సామాన్యులకు కట్టబెడుతున్నారు.


మదనపల్లె శివారులోని బి.కె.పల్లె, కోళ్లబైలు, బసినికొండ, వెంకప్పకోట, వలసపల్లె, పొన్నేటిపాళెం రెవెన్యూ గ్రామాల్లో ఇలాంటివి ఎక్కువగా ఉన్నాయి. పేదలు, రైతులకు ఎప్పుడో జారీ చేసిన అసైన్‌మెంట్ పట్టాలను వివిధ కారణాలతో రద్దు చేసి, ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అలాంటి వాటిని తిరిగి పునరుద్ధరించినట్లు పాత తేదీలతో రికార్డులు సృష్టిస్తున్నారు. వీటిపై కలెక్టర్ నుంచి కొన్నింటికి ఎన్‌వోసీలు పొందగా, మరికొన్ని ఆ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి ఫైళ్లన్నీ కీలకమైన ఖరీదైన ఆ నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఉన్నాయి. అలాగే అన్నదమ్ములు, కుటుంబ వివాదాలతో కోర్టు కేసులున్న భూములను సైతం తక్కువ ధరకు కొనుగోలు చేసి భూమిలోకి వెళ్లి నిర్మాణాలు చేపడుతున్నారు. వారిని ఎదిరించలేని బాధితులు నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో చివరకు విలువైన భూములను వదులుకోవాల్సి వస్తోంది. అలాగే కొంత భూమి కొనుగోలు చేసిన ముసుగులో దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు డీకేటీ భూములను సైతం ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు వివాదాస్పద, కోర్టు కేసులోని విలువైన భూములూ ఉన్నాయి. ఇలా బి.కె.పల్లెలోని సర్వేనంబరు 552, వలసపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబర్ 547, పొన్నేటిపాళెం రెవెన్యూ గ్రామ సర్వే నంబరు 420, బసినికొండలోని సర్వేనంబర్ 708, తదితర సర్వే నంబర్లలో ఇలాంటి పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



పుంగనూరురోడ్డు వలసపల్లె రెవెన్యూ గ్రామంలో వైసీపీ నాయకుడు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ భూమి

తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలంలోని కురబలకోట, అంగళ్లు, కంటేవారిపల్లె, ముదివేడు, తెట్టు, పిచ్చలవాండ్లపల్లె, బి.కొత్తకోట మండలం బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లోని వివిధ సర్వేనంబర్లలో ప్రభుత్వ ప్రైవేటు డీకేటీ భూములు 560 ఎకరాల వరకు పెద్దల కబంధ హస్తాల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కంటేవారిపల్లె సమీపంలోని హార్సిలీహిల్స్ కొండకు దిగువభాగంలోని కురబలకోట సర్వేనంబర్ 1880 నుంచి సర్వేనంబర్ 1950 వరకు పేదల అసైన్డ్ భూములు వైసీపీ చోటా నేతల అధీనంలో ఉన్నాయి. అలాగే అంగళ్లుకు సమీపంలోని కురబలకోట రెవెన్యూ గ్రామ సర్వేనంబర్ 547లోని 2.50 ఎకరాల వంక పోరంబోకును కొందరు అక్రమార్కులు ఆక్రమించి ఆన్‌లైన్ చేయించుకున్నారు. తిరిగీ వాటిని వైసీపీ నాయకులకు అమ్మేశారు. ఈ మార్గం గుండా బైపాస్‌రోడ్డు పోతుండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇలా అవకాశం ఉన్న ప్రతి చోటా ఈ నాలుగేళ్ల కాలంలో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆన్‌లైన్‌లో పేర్లు మార్చడమే కాదు.. అప్పనంగా అమ్మేశారు. మరికొన్నింటిని రైతుల పేరున ఫ్రీహోల్డ్ పథకం జాబితాలో పేర్లు చేర్చి తర్వాత రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కేవలం ఇక్కడ మాత్రమే వంద ఎకరాలకు పైగా ఇలాంటివి ఉన్నాయి. వారికి భూములు విక్రయించని పేదలపై జగనన్న ఇళ్ల పథకాన్ని అస్త్రంగా ప్రయోగించి స్వాధీనం చేసుకోగా, మరికొంద రి పేదల భూముల్లో జగనన్న లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. ఇలా అయిన వారికి ఓ విధంగా, కాని వారికి మరోవిధంగా వ్యవహరించారు. అక్కడి రెవెన్యూ అధికారులు. ఇలా పేదల భూములను పథకాల పేరుతో స్వాధీనం చేసుకోవడం, పెద్దలు లాక్కున్న భూములను వారి పేరుతో ఆన్‌లైన్ చేయడం, ప్రభుత్వ, డీకేటీ భూములు కబ్జా, అన్యాక్రాంతం అవుతున్నా.. పట్టించుకోని అధికారుల్లో ప్రస్తుతం భయం నెలకొంది. గ్రామాల్లో వీఆర్వో నుంచి ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ వరకూ కేసులు, సస్పెన్షన్ భయం వెంటాడుతోంది.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని విద్యుత్తు శాఖను ఊడ్చేసినా.. నోటి మాట ఎత్తని ట్రాన్స్‌కో అధికారులను కూడా ఇదే భయం వెంటాడుతోంది. తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాల్లో లైన్‌మెన్ నుంచి ఏఈ వరకూ అన్ని చోట్లా అక్రమాల్లో పాలు పంచుకున్నారు. రైతుకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు సామగ్రిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. నయానో, భయానో వైసీపీ నేతలు, విద్యుత్తు కాంట్రాక్టర్‌కు సంపూర్ణ సహకారం అందించారు. వైసీపీ నేతలు చెప్పినట్లంతా వీరు తలూపారు. దీన్ని వివరిస్తూ ఇటీవల ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ప్రతి మండలంలోనూ క్షేత్రస్థాయిలో విచారణకు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్తు కాంట్రాక్టర్ దౌర్జన్యంగా ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లినా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం, కనీసం స్థానికంగా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది నుంచి అక్కడి అధికారులు.. డివిజన్‌లోని డీఈ వరకు వైసీపీ నేతలకు అంటకాగినట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఆ శాఖ ఉన్నతాధికారులైన సీఎండీ, ఎస్ఈలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే, ఆ శాఖలో ప్రథమంగా వీరిని బదిలీ చేసింది. ఇక తర్వాత డీఈ స్థాయి నుంచి ఏఈ, తర్వాత లైన్ ఇన్‌స్పెక్టర్ వరకు చర్యలకు రంగం సిద్ధమైంది. ముఖ్యంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ట్రాన్స్‌కోలో జరిగిన ఈ స్కామ్‌పై ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి విచారణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వీరంతా ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఐదేళ్లలో మండలాల వారీగా ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు, ఎంత విద్యుత్తు సామగ్రి మంజూరైంది. ఎంత మంది రైతులకు ఇచ్చారు. మిగిలిన వాటి పరిస్థితి ఏంటి ? ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లి ఎక్కడెక్కడ నిరుపయోగంగా పెట్టారు. వాటి పరిస్థితి ఏంటనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో విద్యుత్తు శాఖ అధికారుల్లో గుబులు నెలకొంది. ఈ నేపథ్యంలో వారంతా స్థానికంగా ఉన్న, తమకు తెలిసిన నేతలను ఆశ్రయిస్తూ చర్యలు లేకుండా భయటపడే మార్గాన్ని అన్వేశిస్తున్నారు. మరోవైపు సస్పెన్షన్, బదిలీ లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలను ఆశ్రయిస్తున్నారు. తమపై చర్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.



కురబలకోట మండలం కంటేవారిపల్లె సమీపంలోని హార్సిలీహిల్స్ కొండ కింది భాగంలో చేతులు మారిన అసైన్డ్‌భూములు

ఆర్జేడీ రాఘవరెడ్డిపై 18, 19 తేదీల్లో విచారణ

- హాజరు కానున్న విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్
- ఉత్తర్వులు విడుదల



రాఘవరెడ్డి (ఫైల్)

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: కడప డీఈవో కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో పూర్వ పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు (ఆర్జేడీ) ఎద్దుల రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరగనుంది. విచారణ అధికారి ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎం.ప్రసన్నకుమార్ హాజరు కానున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎదిగిన రాఘవరెడ్డి కడప డీఈవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తోటి ఉపాధ్యాయులతో అసభ్యకరంగా బూతులతో, ఏకవచన సంబోధనలతో మాట్లాడతారనే ఆరోపణలు ప్రధానమైనవి. అలాగే మహిళా ఉపాధ్యాయుల వస్త్రధారణపై కూడా వ్యంగ్యంగా మాట్లాడతారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలు, పదోన్నతుల్లో వైసీపీ నేతలకు అనుగుణంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా డీఈవో చాంబరులో వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘ నేతలకు ప్రధాన స్థానం కల్పించి వారు చెప్పిన వారికే అనుకూలంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజూ డీఈవో కార్యాలయంలో సాయంత్రం 5 గంటల తరువాత వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలతో కూర్చుని సుదీర్ఘంగా చర్చించేవారని సమాచారం. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం రాఘవరెడ్డి నైజమని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు పరోక్షంగా ప్రత్యక్షంగా పనిచేశారనే అపవాదు ఉంది. రాఘవరెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అప్పట్లో కలెక్టరు, గవర్నరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఎందుకంటే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆర్జేడీ రాఘవరెడ్డిపై ఆధారాలతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ పరిశీలించి విచారణకు ఆదేశించారు. దీంతో ఈ నెల 18, 19 తేదీల్లో కడప డీఈవో కార్యాలయంలో విచారణ జరగనుంది.

ఆరోపణలు వచ్చినా.. ఆర్జేడీగా పదోన్నతి

ఆర్జేడీ రాఘవరెడ్డిపై విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పలుమార్లు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కలెక్టరు స్పందించి డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌తో విచారణ కమిటీ వేశారు. డీఈవోగా ఉన్న రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విద్యార్థి సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు ఆధారాలతో సహా విచారణ కమిటీకి అందించారు. రాఘవరెడ్డి వైసీపీ నాయకులకు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండడం, అలాగే తానే ఒక కార్యకర్తగా వ్యవహరించిన తీరును గుర్తించిన వైసీపీ ప్రభుత్వం ఆయనమీద వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోకపోగా ఆర్జేడీగా పదోన్నతి కల్పించారు. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక కూడా బుట్టదాఖలయ్యాయని చెప్పవచ్చు.

న్యాయం కోసం ఎదురుచూపులు

రాఘవరెడ్డి ద్వారా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం దక్కలేదు. కొత్త ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశతో ఉన్నారు. ఎవరైతే ఆయన చర్యలవల్ల ఇబ్బందులు పడ్డారో వారు, అలాగే విద్యార్థి సంఘాలు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 12: జిల్లాలో చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి 23వ తేది వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. 13న రాత్రి అంకురార్పణ, 14న ధ్వజారోహణం, యాలి వాహనం, 15న హంసవాహనం, 16న సింహవాహనం, 17న హనుమంత వాహనం, 18న శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 19న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న కల్యాణోత్సవం, 21న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 23న పుష్పయాగం, ఏకాంతసేవ కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.



ఆలయం ముందు పందిర్లు వేసిన దృశ్యం

ఇసుక నిల్వలు స్వాధీనం

- 5294 క్యూబిక్ మీటర్లుగా గుర్తింపు
- ఆధారాలు సమర్పించాలని నోటీసులు జారీ

ములకలచెరువు, జూలై 12: ములకలచెరువు మండలం పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోట సమీపంలోని ఇసుక నిల్వలను శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న పాఠశాల నిర్మాణ పనుల కోసం భారీగా ఇసుకను నిల్వ చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో మదనపల్లె డివిజినల్ గనులు, భూగర్భశాఖ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, సర్వేయర్ దుర్గాదేవి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐ తిప్పేస్వామి, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు ఇసుక నిల్వలను పరిశీలించారు. ఈ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకుని కలెక్టర్ శ్రీధర్ చామకూరికి నివేదికలు పంపుతున్నామని, అలాగే పాఠశాల నిర్మాణ పనులు చూస్తున్న మేనేజర్ మురళికి ఇసుక నిల్వలకు సంబంధించిన రికార్డులు సమర్పించాలని నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రికార్డులు పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

బ్యాంకర్లు లక్ష్యాలను అధిగమించాలి

- జిల్లాలో రూ.13,102 వార్షిక రుణ ప్రణాళిక ఆమోదం
- గతేడాది 127.46 శాతం ప్రగతిపై బ్యాంకర్లకు అభినందనలు
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్), జూలై 12: జిల్లాకు సంబంధించి 2024-25లో 13,102 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఆమోదించినట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో (డీఎల్ఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి బ్యాంకర్లు సాధించిన ప్రగతిని లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో మార్చి 31 నాటికి జిల్లాలో మొత్తంగా రూ.11.514 కోట్లు లక్ష్యం కాగా, రూ14.678 కోట్లు రుణాలు అందించి 127.46 శాతం ప్రగతి సాధించడంపై బ్యాంకర్లను వారు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా జిల్లా ప్రగతికి విరివిగా రుణాలివ్వాలని వారు బ్యాంకర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలకు అధిక ప్రాధాన్యతతో 40 శాతం రుణాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పథకాల రుణ మంజూరులో బ్యాంకర్లు తమ లక్ష్యాలను తప్పకుండా అధిగమించాలన్నారు. ఈ ఏడాది ప్రతిపాదిత వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ రుణాలు రూ.9,586 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ.116 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.16 కోట్లు, మొత్తంగా వ్యవసాయ రంగానికి రూ.9,718 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని మహిళ సంఘాల జీవనోపాధికి నిర్దేశించిన రుణాలు స్టాండ్స్ ఇండియా అంశాలలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు బ్యాంకర్లు తమవంతు తోడ్పాటునందించి అధికంగా రుణాలివ్వాలన్నారు. వీధుల్లో చిరు వ్యాపారాలు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెట్టుబడి కింద బ్యాంకుల ద్వారా రుణాలివ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లతో కలిసి 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, రాజశేఖర్, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

జగనన్న కాలనీలో సమస్యల తిష్ట

- కనీసం కాలువలు, రోడ్లు లేవు
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు



వాల్మీకిపురం పట్టణంలోని జగనన్న కాలనీలో సీసీరోడ్లు, కాలువలకు నోచుకోని నివాసాలు

వాల్మీకిపురం, జూలై 12: వాల్మీకిపురం పట్టణంలో 2020లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో సమస్యలు తిష్ఠవేశాయి. నేటికీ పూర్తి సౌకర్యాలు కరువై కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడు విడతల్లో దాదాపు 355 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. రూ.12కోట్ల వ్యయంతో గృహాలు నిర్మించారు. ఇక అప్పటి నుంచి కొంతమంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు పూర్తి చేసి కాపురాలు ఉంటున్నారు. అయితే కాలనీ వాసులకు కరెంట్ సౌకర్యం, తాగునీటి కుళాయిలు ఇచ్చారే తప్ప పూర్తి స్థాయి సౌకర్యాల కల్పన లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ప్రాంతంలో సంవత్సరాలు గడుస్తున్నా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చిన సమయంలో సమస్యలను విన్నవిస్తే అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తాం అంటూ హామీలు ఇచ్చి వెళ్లారే తప్ప సమస్యలు పరిష్కారం కాలేదు. నివాసాలకు కాలువలు లేక సొంతంగా గుంతలు ఏర్పాటు చేసుకున్నామని, కాలనీ వాసులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ప్రాంతంలో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోవడం గమనార్హం. జగనన్న కాలనీ మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం భారంగా మారిందనే చెప్పాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో ఇంటి నిర్మాణం భారంగా మారడంతో లబ్ధిదారులు అర్ధంతరంగా నిలిపివేశారు. ఇసుక, స్టీలు, సిమెంట్ ధరలు నిరుపేదలకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల సమీపాన నిర్మించిన జగనన్న కాలనీకి వసతుల కల్పనకై ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మేరకు దృష్టి సారించారన్న విషయమై సర్వత్రా విమర్శలు చేస్తున్నారు. కాలనీ మంజూరు చేసి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా సౌకర్యాల కల్పన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది. ఇప్పటికైనా కాలనీ ప్రాంతంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పూర్తి సౌకర్యాల కల్పన దిశగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు పూర్తి వసతులు కల్పిస్తాం..

జగనన్న కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గతంలోనే ప్రతిపాదనలు పంపించాము. ప్రస్తుతం కాలనీ సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు పూర్తి స్థాయి వసతుల కల్పన దిశగా చర్యలు తీసుకుంటాం.

\- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, వాల్మీకిపురం మండలం



వాల్మీకిపురం జగనన్న కాలనీకి వెళ్లే మట్టిదారి



కాలనీ ప్రాంతంలో నివాసాలు, గురుకుల పాఠశాలకు సీసీ రోడ్డు లేని దృశ్యం

ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

ఖాజీపేట, జూలై 12: సీజనల్ వ్యాధులపట్ల సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని నిర్లక్ష్యం వహించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ నాగరాజు సూచించారు. శుక్రవారం ఖాజీపేట, మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన ఆయన వైద్యం అందుతుందన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే, ట్యాంకు క్లోరినేషన్ తప్పక చేయాలని, వర్షాలు వస్తుండడంతో నీటి నిల్వలు ఉండి దోమలు ఉధృతి అధికం కావడంతో జ్వరాలు వస్తున్నాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముబీన్, జిల్లా ఎపిడియాలజిస్టు ఖాజామొుద్దీన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, పెంచల్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా ఫెన్సింగ్ తొలగింపు

సీకేదిన్నె, జూలై 12: తాము వేసిన ఫెన్సింగ్‌ను గంట్ల దస్తగిరిరాజు దాదాపు 50 మంది అనుచరులతో దౌర్జన్యంగా తొలగించినట్లు గునకుంట్ల దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులో తమ స్థలానికి గతంలో ఫెన్సింగ్ వేశామన్నారు. అయితే తాము ఇంటి వద్ద లేని సమయంలో ఫెన్సింగ్‌ను తొలగించి పునాది తీసి రాళ్లు తోలినట్లు దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ స్థలం ఇద్దరి మధ్య కోర్టులో ఉన్నా దస్తగిరిరాజు దౌర్జన్యంగా తొలగించారని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై చింతకొమ్మదిన్నె ఎస్ఐ శ్రీనివాసరెడ్డిని కోరగా ఇది రెవెన్యూ డిపార్టుమెంట్‌వారు తేల్చాలని రెవెన్యూ డిపార్టుమెంట్‌కు పంపించి వారి హద్దులు నిర్ణయించాలని కోరినట్లు తెలిపారు. అంతవరకు ఇద్దరూ ఎటువంటి పనులు చేయవద్దని పైగా కోర్టులో ఉన్నదానిపై ఎవరూ తొందరపడరాదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన వైవీయూ పీజీ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: వైవీయూ అనుబంధ కళాశాలల్లో జరుగుతున్న పీజీ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. యూనివర్సిటీల్లో 29 శాఖల విద్యార్థులు 2, 4 సెమిస్టర్ల పరీక్షలు రాశారు. శుక్రవారం వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను రిజిస్ట్రారు, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసెరు ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రకటించారు.

దుబాయ్ చెట్లు తొలగింపు



ప్రభుత్వ ఆస్పత్రిలో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూలై 12: జమ్మలమడుగులో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, రోడ్లపై తదితర ప్రాంతాల్లో ఉన్న దుబాయ్ చెట్లను తొలగిస్తున్నారు. ఆ చెట్ల వలన దోమలు, ఈగెలు తదితర పురుగులతో ప్రజలకు అనారోగ్యానికి గురిచేస్తున్నాయని ఇటీవల తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల ఆవరణాల్లో దుబాయ్ చెట్లను తొలగిస్తున్నారు. జమ్మలమడుగులోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ, మోరగుడి తాడిపత్రి రోడ్డులో విద్యుత్తు కార్యాలయం సమీపాన ఇలాంటి చెట్లను తొలగించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చెట్లు తొలగించిన తర్వాత వెలుతురు మెండుగా వచ్చి దోమలు తగ్గాయని రోగులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

చౌకదుకాణం బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

రైల్వేకోడూరు, జూలై 12: రాఘవరాజపురంలో చౌక దుకాణం బియ్యంను శుక్రవారం రెవెన్యూ ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో నిరంజన్ దాడి చేసి పట్టుకున్నారు. వారు మాట్లాడుతూ చౌక దుకాణానికి చెందిన 27 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు. పట్టుకున్న బియ్యం ఎవరికి తరలిస్తున్నారనేది తెలియరాలేదని తెలిపారు. బియ్యంను ప్రభుత్వ గోదాముకు తరలించామన్నారు.

అక్రమ రేషన్‌బియ్యం పట్టివేత

గాలివీడు, జూలై 12: ఒక రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వవుంచిన రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సివిల్ సప్లయ్ డీసీఎస్ఓ రఘురాం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాల్లోకెళ్తే.. మండల కేంద్రంలో కొద్ది రోజులుగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు సమాచారం అందింది. శుక్రవారం జీవీ శ్రీనివాసులు రైస్‌మిల్లులో తనిఖీ చేశామన్నారు. అందులో అక్రమంగా నిల్వవుంచిన పదిబస్తాలు రేషన్‌బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా నిల్వ వుంచిన వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిల్వవుంచినా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఉస్మాన్, ఆర్ఐ బాలాజి, వీఆర్ఓలు అల్లాబకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

570 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



చిన్నమండెం, జూలై12: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 570 బస్తాల రేషన్ బియ్యంతో వెళ్తున్న ఏపీ 39టీ 8606 లారీని పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. అనుమానంతో ఆపి చెక్ చేయగా బియ్యం బస్తాలుగా గుర్తించారు. వాటిని శాంపిల్స్ పంపించగా అవి రేషన్ బియ్యం అని తేలడంతో ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఖాజీపేట, జూలై 12: డయేరియాతో బాధపడుతున్నవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిడుతూరు గ్రామస్థులను పలకరించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కలుషిత నీరు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, అంతేకాక ప్రతి ట్యాంకును శుభ్రపరచి మంచినీటిని అందించాలన్నారు. టీడీపీ నేతలు శ్రీరాములుయాదవ్ పాల్గొన్నారు.

నిప్పంటించుకుని కారులో వ్యక్తి మృతి

పులివెందుల టౌన్, జూలై 12: మద్యం మత్తులో నిప్పంటించుకుని కారులో వ్యక్తి మృతి చెందాడు. బొగ్గుడుపల్లెలో శుక్రవారం చోటుచేసుకున్న ఘటనలో కెళితే... బొగ్గుడుపల్లె వాసి ప్రభాకర్‌రెడ్డి (70)కి కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. శుక్రవారం తన కల్లంలో ఉన్నకార్లోకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుని మృతిచెందినట్లు సమాచారం. ఈ సంఘటనపై సీఐని వివరణ అడగ్గా మా దృష్టికి రాలేదన్నారు.

అందుబాటులో ఇంటర్ సర్టిఫికెట్స్

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: జిల్లాలో అన్ని జూనియర్ కళాశాల్లో 2024కు సంబంధించి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్స్ అందుబాటులో ఉన్నాయని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని కోరారు.

ఇది ప్రజా విజయం

- సీఎంరమేశ్ విజయోత్సవ ర్యాలీ విజయవంతం
- పొట్లదుర్తిలో పెల్లుబుకిన అభిమానం
- పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, అభిమానులు స్వాగతం
- తల్లి దీవించగా.. దిష్టితీసి ఆహ్వానించిన చెల్లెళ్లు
- మరువలేని అభిమానం : సీఎం రమేశ్





తల్లిని ఆలింగనం చేసుకుని దీవెనలందుకుంటున్న సీఎంరమేశ్ - సీఎం.రమేశ్‌కు దిష్టితీస్తున్న సోదరీమణులు, తమ్మునికూతురు

ఎర్రగుంట్ల, జూలై 12: అనకాపల్లి ఎంపీగా విజయం సాధించి జిల్లాకు వచ్చిన సీఎం రమేశ్‌కు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దీంతో ఎంతో పులకింకిన ఆయన ఇది ప్రజా విజయమని మరువలేని అభిమానమని, గర్వంగా ఉందన్నారు. స్వగ్రామం పొట్లదుర్తిలో సీఎం రమేశ్‌కు తల్లి రత్నమ్మ ఆశీర్వాదం అందించడం సోదరీమణులు దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించారు. ప్రజలు ఆయనకు జేజేలు కొట్టారు. వివరాల్లోకెళితే....

శుక్రవారం ఉదయం సీఎంరమేశ్ కడప ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. వందలాది వాహనాలు వెంటరాగా పొట్లదుర్తి నాలుగురోడ్ల కూడలి వద్ద ఆయన ఓపెన్ టాప్ వాహనంలో విజయ దరహాసంతో రెండుచేతులతో అందరికీ నమస్కారం చేయడంతో అభిమానులు రెట్టించిన ఉత్సాహంతో ఆయనకు ఘనస్వాగతం పలకగా, భారీ క్రేన్‌తో గజమాల వేశారు. పూలుచల్లుతూ అభిమానులు కార్యకర్తలు స్వాగతం పలికారు. తన అవ్వతాతలు సీఎం.సుబ్బానాయుడు, సుబ్బమ్మ కాంస్య విగ్రహాలకు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నమస్కరించారు. ఇంటి ముందు చెల్లెళ్లు మాధవి, విజయ దిష్టితీసి హారతివ్వగా, తల్లి రత్నమ్మ దీవెనలు తీసుకుని ఆయన ఇంట్లోకి వెళ్లారు. పొట్లదుర్తి జనసంద్రంగా మారింది. ఎటుచూసినా వాహనాలు, ప్రజలే కనిపించారు. తెలుగు యువత రాష్ట్ర నేత సారథినాయుడు ఆధ్వర్యంలో సుమారు 25వాహనాలతో పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ ఎర్రగుంట్ల మండల కన్వీనర్ మేకల మోహన్‌రెడ్డి, చెమికల రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలతో వెళ్లి బొకేలిచ్చి స్వాగతం పలికారు.

ఇది ప్రజల విజయోత్సవం

ఇది ప్రజల విజయోత్సవ ర్యాలీగా అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ పేర్కొన్నారు. ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరవలేనన్నారు. వేలాది మంది బ్రహ్మరథం పట్టారన్నారు. విజయోత్సవ భారీర్యాలీ విజవంతమైందన్నారు. ఇందుకు కృషి చేసిన నేతలు, అభిమానులు, ప్రజలకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, రైల్వేకోడూరు టీడీపీనేత విశ్వనాథ నాయుడు, సీఎం సురేష్ నాయుడు సోదరులు సీఎం.రాజేష్, సారథినాయుడు, సుధీర్ నాయుడు, బిస్మిల్లాబాదు వాసుదేవరెడ్డి, నాగరాజు నాయుడు, ఎంపీటీసీ శివప్రతాప్‌రెడ్డి, జయప్రకాష్ నాయుడు, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భారీగా సన్మానం..

అనకాపల్లి ఎంపిగా గెలుపొంది పొట్లదుర్తికి వచ్చిన సీఎంరమేశ్‌కు ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు వరద రాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి సీఎంరమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్‌శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నేతలు సింగారెడ్డి రామచంద్రారెడ్డి సీఎం రమేశ్‌కు శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ నేతలు హరిప్రసాద్, ముక్తియార్, నాగులపల్లి చంద్ర ఓబుళరెడ్డి రమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా రైల్వేకోడూరు, రాజంపేట, శ్రీకాళహస్తి, అనంతపురం జిల్లాల నేతలు ఆయన్ను కలిసి శాలువాలు కప్పి, బొకేలిచ్చి పెద్దఎత్తున సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పెద్దఎత్తున సీఎంరమేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా నేతలు రమేశ్‌కు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.



భారీగా వచ్చిన అభిమానులకు భోజన ఏర్పాట్లు

భారీ పోలీసు బందోబస్తు

విజయోత్సవ ర్యాలీ సందర్భంగా సుమారు 130 మంది పోలీసు సిబ్బందితో దారిపొడవునా భద్రతను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేశారు.

వేలమందికి భోజనాలు

సీఎంరమేశ్ విజయోత్సవ ర్యాలీ పురస్కరించుకుని పొట్లదుర్తిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో సుమారు 8వేల మందికి మాంసాహార భోజనాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది కార్యకర్తలతో క్యూలైన్లు ఏర్పాటు చేసి 12కౌంటర్లలో అందరికీ భోజనాలను వడ్డించారు.

హెల్మెట్ ఉపయోగంపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న ట్రైనీ న్యాయమూర్తులు చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి

కడప(రూరల్) జూలై 12: హెల్మెట్ ఉపయోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని తద్వారా ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని ట్రైనీ న్యాయమూర్తులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, కె. సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రిమ్స్ పోలీస్‌స్టేషన్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వాడకం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సెక్షన్ 124 మోటార్ వెహికల్ అక్సిడెంట్ చట్టం, సెక్షన్ 304, 183, 184, రూల్ 176 ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలపైన స్పీడ్ కెమెరా, క్లోజ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్ తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతోందన్నారు. అనంతరం వారు కడప కేంద్రకారాగాన్ని విజిట్‌చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. రిమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర, ఎస్ఐ నారాయణ, ఏఎస్ఐ యోగ, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తప్పిన ఘోర ప్రమాదం

అదుపు తప్పి శివాలయం ప్రహరీని ఢీకొన్న కారు



శివాలయం గోడను ఢీకొన్న కారు

రైల్వేకోడూరు, జూలై 12: ప్రధానదారిలో శుక్రవారం ఓ కారు అదుపు తప్పి శివాలయం ప్రహరీని ఢీకొంది. రైల్వే స్టేషన్ సమీపం నుంచి కడప వైపు వెళుతున్న కారు శ్రీక్రిష్ణదేవరాయులు విగ్రహం వద్ద అదుపు తప్పింది. ఏకంగా తోపుడు బండ్ల వైపు దూసుకుపోయి శివాలయం ప్రహరీని ఢీకొంది. దీంతో గోడ కొంత కూలిపోయింది. కారు వేగంగా రావడంతో శివాలయం వద్ద ఉన్న తోపుడు బండ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో తోపుడు బండ్లు, పార్క్ చేసిన వాహనాలు దెబ్బతిన్నాయి. పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగే సమయంలో తక్కువ మంది జనాభా ఉండడంతో ఘెర ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారిస్తున్నా రు. కారు డిక్కీ తెరిచి మళ్లీ డిక్కీ వేసి కారు తాళాలు పెట్టి స్టార్ట్ చేయగా వేగంగా కారు కదిలిందని డ్రైవర్ బుకాయించాడని స్థానికులు తెలిపారు.

నవభారత నిర్మాణంలో యువతే కీలకం



ప్రశంసాపత్రం అందిస్తున్న మణికంఠ

కడప (మారుతీనగర్), జూలై 12: నవభారత నిర్మాణానికి యువతే కీలకమని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ అన్నారు. ఆపదలో ఉన్న వారికి దాతల సాయంతో రక్తం అందిస్తున్న జె.బి.వి.ఎస్ సంస్థ శ్రమిస్తున్న తీరును అభినందిస్తూ సొసైటీలో ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు అశోక్, బ్లడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు శివశంకర్‌రెడ్డి, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు వైద్యులు రాజేంద్రప్రసాద్, వలంటీర్లు, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను చంపి పూడ్చిన భర్త

అనుమానమే కారణమా?

పోలీసు స్టేషనులో లొంగిపోయిన వైనం

శవాన్ని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు



రేష్మ ఫైల్ ఫొటో

ప్రొద్దుటూరు, జూలై 12: భార్య రేష్మకు మరికరితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కట్టుకున్న భర్తే కడతేర్చాడు. అంతటితో ఆగక శవాన్ని పూడ్చివేసి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విషాద సంఘటనవివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం అమృతనగర్ వాసి అన్వర్ బాషకు మైలవరం మండలం దొడియంకు చెందిన రేష్మను వివాహం చేసుకున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం అన్వర్ బాషా ప్రొక్లయినర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కాగా తన భార్య రేష్మకు మరికరితో వివాహేతర సంబంధం వుందనే అనుమానం కలిగింది. దాన్ని జీర్ణించుకోలేక ఆమెతో నమ్మబలికి ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ ఏకోపార్కు ఎదురుగా వున్న రిజర్వుఫారెస్టులోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె మెడకు చున్ని బిగించి గొంతునులిమి చంపాడు. ఏకంగా రిజర్వుఫారెస్టులోని భూమిలో పూడ్చివేశాడు. ఆ తరువాత ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషనుకు వెళ్ళి లొంగిపోయి తన భార్యను అనుమానంతో చంపినట్టు వారికి తెలిపాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఎర్రగుంట్ల రోడ్డులోని రిజర్వుఫారెస్టు భూమిలో రేష్మను చంపి పూడ్చిన ప్రదేశాన్ని పోలీసులు కనుగొన్నారు. శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ సీఐ రమణారెడ్డి వెల్లడిస్తున్నారు. ఈ హత్యపై ఇంకా పూర్తి స్థాయిలో విచారణ జరిపి పూర్వపరాలు వెల్లడిస్తామని వారు మీడియాకు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు రూరల్ పోలీసుల అదుపులోనే వున్నాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు కూడా వున్నట్లు సమాచారం.



శవాన్ని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోరుపైపుల చోరీ విఫలయత్నం

కొండాపురం, జూలై 12: ప్రసిద్ధ క్షేత్రమైన దొంతికోన వేంకటేశ్వర స్వామి కోనలో బోరుపైపుల చోరికి విఫలయత్నం జరిగింది. కోనలో ఉన్న 35 బోరు పైపులను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడానికి యత్నించినట్లు ఆలయ కమిటీ మెంబర్ ప్రతాప్ యాదవ్ తెలిపారు. అయితే పైపులు తీసే సమయంలో తమ మనషులు వెళ్లే సరికి వారు పారిపోయినట్లు ఆయన తెలిపారు.

తాడిపత్రి కేసులో 60 మంది బెయిలుపై విడుదల

కడప (క్రైం), జూలై 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో జరిగిన ఘర్షణ సంబంధించి కడప సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీలుగా ఉన్న 60 మందిని బెయిలుపై విడుదలయ్యారు. శుక్రవారం ఈ మేరకు విడుదల కానున్న వారి బంధువులు కడప సెంట్రల్ జైలు వద్దకు వచ్చి విడుదలైన వారిని సొంత గ్రామాలకు తీసుకెళ్లారు.

సెకండియర్ డిప్లమాలో స్పాట్ అడ్మిషన్స్

కడప (ఎడ్యుకేషన్), జూలై 12: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో ఇంటర్ వృత్తి విద్య కోర్సు ద్వారా డిప్లమా సెకండియర్ చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ కోసం 16వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. 18తేదీన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌కు ప్రభుత్వ కళాశాలల్లో అయితే రూ.4700, ప్రైవేటులో రూ.25వేలు చెల్లించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

సుండుపల్లె, జూలై 12: ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాలలో భాగంగా మండలంలోని పింఛా ప్రాజెక్టుపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. సుండుపల్లె, కేవీపల్లె మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజర య్యారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున వైభవంగా ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాల జరగనుంది, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో చాందినీ బండ్లు దర్శనం ఇవ్వనున్నాయి.

ఎంపీటీసీ ఫిర్యాదుపై డ్వామా పీడీ విచారణ



విచారణ చేస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

పెనగలూరు, జూలై 12 : మండలంలోని కట్టావారిపల్లె పంచాయతి పరిధిలో గల రేణిగుంటవారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌పై కట్టావారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు కస్తూరి శ్రీనివాసులునాయుడు వారం రోజుల కిందట కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై శుక్రవారం డ్వామా పీడీ మద్దిలేటి, ఏపీడీ వరప్రసాద్ విచారణ చేశారు. కట్టావారిపల్లెతో పాటు అరతపల్లె, ఎస్‌ఆర్‌పురంలలో ఉపాధిహామీ పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధిహామీ కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై విచారించినట్లు తెలిపారు.

ఉప్పరపల్లెలో అక్రమ కట్టడాలపై నారా లోకేశ్‌కు ఫిర్యాదు

సిద్దవటం, జూలై 12 : మండలంలో వైసీపీ నాయకుల భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని, కడప - చెన్నై రహదారిలోని ఉప్పరపల్లె మెయిన్‌రోడ్డు వద్ద అడ్డుగోలుగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్సును తొలగించి ఆ స్థలాలు పేదలకు పంచి పెట్టాలని కోరారు. షాపింగ్ కాంప్లెక్సు స్థలాలు, ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 936/ఎ , గ్రామ పంచాయతీలో వైసీపీ నేతల భూ ఆక్రమణలపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి పంచాయతీ పరిధిలోని భూకబ్జాలపై పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు రాజంపేట నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్టా శివప్రసాద్ తెలిపారు.

కొత్తపురమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

సంబేపల్లె, జూలై12: కొత్తపురమ్మ ఆలయాన్ని అధునాత టెక్నాలజీతో పునర్నిర్మాణం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పురాతన ఆలయాన్ని తొలగించే పనులు శుక్రవారం ప్రారంభించారు. వేద పండితులు పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాలను పక్కకు తరలించారు. ఏడాదిలోపు గుడి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి సోదరి శ్రీలత, దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, సంబేపల్లె మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉపేంద్రారెడ్డి, సంబేపల్లె ఎస్‌ఐ రామకృష్ణ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులకు శాలువా కప్పి సత్కరించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

హౌసింగ్ బిల్లులపై అపోహలు వీడండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులరెడ్డి

సుండుపల్లె, జూలై 12: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు డిసెంబరు ఆఖరులోగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. శుక్రవారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. బిల్లులకు ఎటువంటి ఢోకాలేదు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు కోరారు. అపోహలు వీడి పునాది దశలో ఉన్న ఇండ్లను సైతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమర్‌నాథ్, హౌసింగ్ ఏఈ నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణాలు వంద రోజుల్లో పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి చెంగల్ రాయులు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గృహనిర్మాణ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. వంద రోజుల్లో లక్ష్యం పూర్తి కాని పక్కాగృహాలు, తదుపరి ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటాయన్నారు. లబ్ధిదారులక్కు బిల్లులు, మెటీరియల్ త్వరితగతిన అందజేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హౌసింగ్ ఏఈ హరి ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐకేపీ ఏపీఎం ఏసీ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట నిర్వాసితులకు పునరావాసం కల్పించండి: కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, జూలై 12: మంగంపేట నిర్వాసితులకు పునరావాస పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను అదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించగా, పునరావాస పనులపై అర్ అండ్ బీ, హౌసింగ్, విద్యుత్ ,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, పట్టాల పంపిణీ తదితర అంశాలపై ఆరా తీశారు. జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో సత్యనారా యణ, రాజంపేట అర్డీఓ మోహన్‌రావు, అర్‌అండ్‌బీ ఏఈ సహదేవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూకబ్జాలు అడ్డుకుంటాం

● టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

ఒంటిమిట్ట, జూలై 12 : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైసీపీ నేతల భూకబ్జాలపై విచారణ చేయించి, ఆ భూములను పేద ప్రజలకు పంచి పెడతామని, ఒంటిమిట్ట జడ్పీటీసీ, చింతరాజుపల్లె ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం సాలాబాదు, నడింపల్లె, చింతరాజుపల్లె, మారయ్యగారిపల్లె గ్రామ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సమయాభావం వల్ల అందరిని కలవ లేక పోయానని, ఇప్పుడు అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తూ ఆయా గ్రామాల సమస్యలను తెలుసుకుంటున్నానన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు మాట్లాడుతూ తామందరం సుగవాసి ఆధ్వర్యంలో కలసికట్టుగా పనిచేస్తామన్నారు. నడింపల్లె, మారయ్యగారిపల్లె నాయకులు నీటి సమస్యను సుగవాసి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చింతరాజుపల్లెలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, పూజలు నిర్వహించారు. ఒంటిమిట్ట, రాజంపేట మండలాల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, గన్నే సుబ్బ నరసయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బాషా, సీనియర్ టీడీపీ నాయకులు రామదాసు, ఎస్‌వి రమణ, బొడ్డే వెంకట రమణ, వినోద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మేకా నరసింహులు, నామా హరిరాయల్, కేతారెడ్డయ్య రాయల్, కాంట్రాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై శిక్షణ

ఓబులవారిపల్లె, జూలై 12 : మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణ ఇచ్చారు. మారుతున్న వాతావరణానికి అనుకూలంగా పంటలు సాగు చేయాలని తెలిపారు. అందుకు సంబం దించిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువులు, వర్మీకంపోస్టు తయారీపై రైతు శిక్షణ కేంద్రం ఏవో సుచిత్ర, స్థానిక ఏవో మల్లిక సూచనలు, సలహాలు అందించారు. నానో యూరియా వాడకం మామిడిలో పంటలు, కోత అనంతరం కొమ్మల కత్తిరంపు, సాగు యాజమాన్య పద్ధతులు తెలిపారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు నందిని, మధు, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది బుల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డ్ సౌజన్యంతో మామిడి తోటల పెంపకం

లక్కిరెడ్డిపల్లె జూలై 12; నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాటర్‌షెడ్ ప్రాజెక్టు ద్వారా శుక్రవారం బత్తెనవాండ్లపల్లెలో మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వాటర్‌షెడ్ చైర్మన్ బీవీ రత్నం మాట్లాడుతూ డబ్ల్యుఎఫ్ నాబార్డ్ వాటర్‌షెడ్ ద్వారా మూడేళ్లగా కస్తూరిరాజుగారిపల్లెలో భూసంరక్షణ, నీటి సంరక్షణ , పండ్ల తోటలు పెంపకం తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీలో సుమారు 50 ఎకరాల్లో మామిడి మొక్కలు అందజేశామన్నారు. ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ సంస్థ అధినేత రాచరాయుడు, వీరనాగయ్య పాల్గొన్నారు

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

చిట్వేలి, జూలై 12 : ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మానవత చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో శనివారం బహుమతులు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన తేజశ్వికి మానవత చైర్మన్ తిరుమల విశ్వనాథ 5,555 నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో అందించారు. కార్పొరేట్ పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని ఎస్.సౌమ్యకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మోహన్ 3 వేలు, మానవత దాతల సహకారంతో 2,555 రూపాయలు అందించారు. మండలంలో ప్రభుత్వం, కార్పొరేట్ పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు దాతల సహకారంతో 1116 నగదు, ఉపసర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ఆకేపాటి వెంకటరెడ్డి, తురక రంగారెడ్డి, మానవత అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డి, జాని, రెడ్డయ్య, సభ్యులు విద్యార్థులకు అందించారు. మానవత అధ్యక్ష, కార్యదర్శులు మునిరావు, సాయిరాం, సభ్యులు, చంద్ర, మాదినేని నరేష్, వెంకటసుబ్బయ్య, హరి, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 12: స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళీ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అమ్మవారిని అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చన, రాహుకాల పూజలు నిర్వహించారు.

సీఎం రమేష్‌ను కలసిన కస్తూరి, మాచినేని



సీఎం రమేష్‌ను సత్కరిస్తున్న కస్తూరి, మాచినేని

రైల్వేకోడూరు, జూలై 12: అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ కడప జిల్లాకు రావడంతో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు కడపలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గానికి కేంద్రం నుంచి నిధులు ఇప్పించి అభివృద్ధి చేయాలని కోరామని తెలిపారు. రైల్వే కోడూరు-వెంకటగిరి రోడ్డుకు అటవీ అనుమతులు కావాలని, రైల్వే అండర్ బ్రిడ్జి నత్త నడకన సాగుతోందని, మైనింగ్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేయించాలని, కోడూరును ఉద్యాన హబ్‌గా మార్చాలని, మూతపడిన అప్సా జ్యూస్ పరిశ్రమను తెరిపించాలని , నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు పనులపై చర్చించామని తెలిపారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ నాయకులు నాయిడోరి రమణ, టీడీపీ నాయకులు రెడ్డయ్య, ముక్కర శంకరయ్య, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: కడప విమానాశ్రయం వద్ద ఎంపీ సీఎం రమేష్‌ను రాజంపేట టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర టీడీపీ నేత హరిప్రసాద్, ఊటుకూరు మాజీ సర్పంచ్‌లు మన్నేరు లక్ష్మీనరసయ్య, ఎం.ఎల్.నారాయణ, సుబ్బనరసయ్య, నాగా నరసింహులు, రెడ్డిప్రసాద్, సిద్దవటం నాయకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండలంలోని టీడీపీ నాయకులు ఎంపీ సీఎం రమేష్‌నాయుడును కడప విమానాశ్రయంలో కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో గజమాలతో ఆయనను సత్కరించారు. మావిళ్ల శ్రీహరి, రేవిళ్ల బాలమునెయ్య, కాంట్రాక్టర్ బిల్లా లక్ష్మీనరసయ్య, మోదుగుల నరసింహులు, పాములూరు సుబ్రమణ్యం, మావిళ్ల క్రిష్ణ, పలువురు టీడీపీ నాయకులు కలిసి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగస్వామి

రామాపురం, జూలై 12: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక, మట్టి రవాణా చేయాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా చూసుకోవాలని వీఆర్‌వోలకు సూచించారు. అనంతరం కుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్, వీఆర్‌వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్‌వో విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె జూలై 12: ప్రతి ఏటా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంపూర్ణత అభియాన్, ఆస్పిరేషన్ బ్లాక్స్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రాచపల్లెలో ముప్పాల ఆనందరాజు అనే రైతు పొలంలో భూసార పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .భూసారపరీక్షలతో ఎరువుల ఖర్చులు తగ్గుతాయన్నారు. భూమి లోని పోషకాల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. లక్కిరెడ్డిపల్లె నీతి అయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, వ్యవసా య విస్తరణ అధికారులు కెరోలిన్, చాన్‌బాషా, అనూష రైతుసేవాకేంద్రం అధికారి నాగరాజు, పవన్, సాయి, కీర్తి, పరిమళ, రమేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

రైతు సేవా కేంద్రం సహాయకులకు శిక్షణ

సిద్దవటం, జూలై 12 : స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం మండలానికి చెందిన 10 రైతు సేవాకేంద్రాల సహాయకులకు ఖరీఫ్ 24వ సీజన్ సమాయత్తంపై మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని, రైతు భరోసా కేంద్రం రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించాలని, వరిలో విత్తనశుద్ధి, ఉత్తమ యాజమాన్య పద్ధతులు తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న పీఎం కిసాన్, 5 శాతం ఫిజికల్ వెరిఫికేషన్, మట్టి నమూనా సేకరణ తదితర పనులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పనిచేసే రైతుల సంఖ్య, పంటల విస్తీర్ణం పెంచాలని తెలియజేశారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించడం జరిగింది.

డెంగ్యూ, డయేరియాపై విద్యార్థులకు అవగాహన

సంబేపల్లె, జూలై 12: డెంగ్యూ, డయేరియాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై. ప్రసాద్ తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి, హెల్త్ సూపర్‌వైజర్ సదాశివరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ షబ్రీన్, ఉపాధ్యాయులు సుమంత్ సేన్, మురళి, చంద్రయ్య, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈర్లకుంట అలుగు కాలువ పూడ్చారని ఫిర్యాదు

రామాపురం, జూలై 12: మండలంలోని ఈర్లకుంట మరువ కాలువను వడ్డెపల్లెకు చెందిన రౌతు వెంకటయ్య, ఆయన కుమారుడు వెంకటస్వామి పూడ్చారని సుగాలిబిడికీ చెందిన ఆయకట్టు రైతులు మూడే కృష్ణానాయక్, బుక్కే గోపీనాయక్ శుక్రవారం రామాపురం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈర్లకుంట కింద పలువురు రైతులు భూములు సాగుచేసుకుంటున్నారని, ఈర్లకుంట చెరువు నిండితే నీలకంఠ్రావుపేట చెరువుకు ఈ కాలువ ద్వారా నీరు పోతాయని పేర్కొన్నారు. ఈ కాలువను కబ్జా చేసేందుకూ పూడుస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా... ఈ అలుగు కాలువను పరిశీలించడానికి స్థానిక వీఆర్‌వో సాగర్, ఆర్‌ఐ రవికుమార్‌లను ఫీల్డ్‌మీదికి పంపుతున్నారని తహసీల్దార్ తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో వైసీపీ విఫలం

సుండుపల్లె, జూలై 12: రైతులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నమయ్య జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం సుండుపల్లెలో జిల్లా రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి మోసం చేశారని విమర్శించారు. కరువు మండలాలుగా గుర్తించిన మండలాల్లోని రైతులకు సైతం నష్టపరిహారం అందించడంలో గత ప్రభుత్వం చేసిన మోసాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడిగా రెడ్డిచర్ల వెంకటయ్య, మండల అధ్యక్షుడిగా లక్ష్మీశేఖర్, ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వరయ్య, శివయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

14న రాయచోటిలో ఉచిత మెగా వైద్య శిబిరం

రాయచోటిటౌన్, జూలై 12: పట్టణంలోని బడేకరేమియా మసీదు ఆవరణలో ఈ నెల 14న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఏ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ నహవీల్‌బాషా, లైఫ్ కేర్ క్లినిక్ వైద్యులు జక్రియా అహ్మద్, రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు ఎస్‌కే హస్సేన్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు రాయచోటి పట్టణంలోని బంగ్లా సమీపంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్ కేర్ క్లినిక్, షిఫా ఆసుపత్రుల ఆధ్వర్యంలో కొత్తపల్లి ప్రాంత ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తార న్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ కృష్ణారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబులు హాజరవుతారన్నారు. శిబిరంలో వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. మందులు సైతం ఉచితంగా అందజేస్తారన్నారు. సొసైటీ సభ్యులు ఎజాస్‌బాషా, షేక్. రబ్బానీ, షేక్. మహమ్మద్‌గౌస్, ఖాదర్‌బాషా (శివాజీ బీడీ), షేక్. మన్సూర్‌అలీ, అబూబకర్, జాఫర్, జబీవుల్లా, షరీఫ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంటిమిట్ట, జూలై 12 : మండల విద్యుత్ సర్కిల్ పరిధిలోని ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం మండలాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒంటిమిట్ట, ఎస్‌కెఆర్, సాలాబాదు, మంటపంపల్లె, పాటూరు, పెద్దపల్లె, సిద్దవటం, లింగంపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామాపురం: మండలంలో 33/11కేవీ లైన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదని రామాపురం ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటలకు 3 ఫేస్ సప్లై ఉంటుంది కావున, అన్ని గ్రామాల్లో ఆ సమయంలోనే. ప్రజలు తాగునీరు పట్టుకోవాలని కోరారు.

మొహరం ఉత్సవాలకు ప్రసాద్‌బాబుకు ఆహ్వానం



ప్రసాద్‌బాబును ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, జూలై 12: ఈ నెల 17నచిన్నమండెం మండల కేంద్రంలో జరగనున్న మొహరం ఉత్సవాలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సుగవాసి ప్రసాద్‌బాబును ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం సుగవాసి కార్యాలయానికి చేరుకుని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు గౌస్‌సాబ్, సాధక్‌అలీఖాన్, ముషాయద్ అలీ ఖాన్, బాబ్జీ, సైపుల్లా, వాజిద్‌ఖాన్, హిదాయత్‌ఖాన్, అబిద్, రహమత్ పాల్గొన్నారు.

అన్నమాచార్యలో వ్యాసరచన పోటీలు

రాజంపేట, జూలై 12 : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నోబెల్ గ్రహీత మలాలా జన్మదినం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన పి.సుజిత, కె.షకీబ్‌అహ్మద్, స్నేహలతారెడ్డిలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవి నారాయణ మాట్లాడుతూ మలాలా బాలికల విద్యకోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.బాలనాగేంద్ర ప్రసాద్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు

రాయచోటిటౌన్, జూలై 12: ఈ నెల 24, 25, 26వ తేదీల్లో హార్స్‌లీహిల్స్‌లో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత కేశవరావు, హరిప్రసాద్, శేషయ్య, రమణమ్మ, నాగమణి, భరత్‌చంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో నాయకులు

రాజంపేట, జూలై 12 : రాజంపేట బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు జనసేనపార్టీ నేత కొండేటి రవి ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ పార్లమెంట్ నాయకులు శ్రీనివాసరాజు, గీతాంజలి రమణ, యల్లటూరు శివరామరాజు, షబ్బీర్‌అహ్మద్, సమ్మెట శివప్రసాద్, సుధాకర్, అతిగారి గోపాల్, రమేష్, కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శికి సన్మానం

రామాపురం, జూలై12: సాంఘిక సంక్షేమ గురుకులాల (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికల్లో రామాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ ఘనంగా సన్మానించి అభినందించారు.


డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా భాస్కర్‌రెడ్డి

రైల్వేకోడూరు, జూలై 12: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ యం. భాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుమల-తిరుపతి దేవస్థానంలో డీఈవోగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కలసి ఆయన్ను ఘనంగా సత్కరించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి. నరసింహులు, తిరుపతి ఆఫీసర్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ టి. రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు

రామాపురం, జూలై 12: విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ హెచ్చరించారు. మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జూన్ 21 నుంచి అక్టోబరు 4 వరకు నిర్వహించనున్న వంద రోజుల అవగాహన సదస్సులో బేటీ పడావో, బేటీ బచావో, భారతీయ న్యాయ సంహిత శక్తిసదం, ఉమెన్ హెల్ప్‌లైన్ తదితర అంశాలను వివరించాలన్నారు. ఆయా కార్యక్రమాలకు తల్లులను ఆహ్వానించాలన్నారు. అనంతరం తల్లులు, పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు పద్మజారాణి, సుజాత, హస్సేనమ్మ పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై దృష్టి సారించండి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న అతికారి కృష్ణ


సిద్దవటం, జూలై 12 : నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని స్థాని జనసేన నేత అతికారి కృష్ణ శుక్ర వారం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్‌కు వి న్నవించారు ఏపీ సచివాలయంలో శుక్ర వారం మంత్రిని కలిసి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రతిపక్ష హోదాలో సిద్దవటం గ్రామాన్ని సందర్శించినపుడు ఇచ్చిన హామీ ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సిద్దవటం పురాతన కోట, ఒంటిమిట్ట చెరువు తదితర పర్యాటక రంగాలను టూరిస్టులకు అందు బాటులోకి తెచ్చేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి విన్నవించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై అవగాహన

రాజంపేట, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై కొత్తబోయనపల్లె హైస్కూలు హెచ్‌ఎం భారతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్య ఆవశ్యకతను వివరించారు.

- చంద్రబాబు హయాంలోనే నిధులు.... పనులు
- గత ప్రభుత్వంలో పూర్తిగా స్తంభించిన పనులు
- రూ. 2500 కోట్లతో పూర్తి కావాల్సిన కాంట్రాక్టు రద్దు


బాలాజీ రిజర్వాయర్ వద్ద పనులాగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనం



- రూ. 5 వేల కోట్ల అంచనాతో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- పరిశీలనలోనే ముగిసిపోయిన పుణ్యకాలం

గాలేరు-నగరిపై మళ్లీ ఆశలు

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పర్యటించిన సందర్భంగా ఆ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చారు.అన్ని రంగాల్లో వెనుక బాటుతనానికి గురైన ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేయాల్సిందే. అయితే సొంత జిల్లాలో ఐదేళ్ళుగా అతీగతీ లేకుండా పోయిన గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు విషయంలోనూ జిల్లా ప్రజలు ఆయన నుంచీ ఇదే ప్రాధాన్యతను కోరుకుంటున్నారు. 1985 నుంచీ జిల్లా వాసులను ఊరిస్తున్న గాలేరు-నగరి ప్రాజెక్టును దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఏ ముహూర్తాన ప్రకటించారో గానీ అప్పటి నుంచీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే వుంది. రామారావు తర్వాత ఎందరో ముఖ్యమంత్రులు మారినా పనులు మొదలైంది మాత్రం చంద్రబాబు హయాంలోనే. గత ఐదేళ్ళూ వైసీపీ ప్రభుత్వంలో పనులు స్తంభించడమే కాక మునుపటి కాంట్రాక్టును రద్దు పరిచి డిజైన్ సైతం మార్చేశారు. ఇపుడు మళ్ళీ చంద్రబాబు సీఎం కావడంతో సొంత జిల్లా ప్రజల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.



చంద్రబాబు హయాంలో జరిగిన బాలాజీ రిజర్వాయర్ కట్ట పనులు

ప్రాజెక్టు నేపథ్యం

దివంగత సీఎం ఎన్టీ రామారావు రాయలసీమలో కరువు శాశ్వత నివారణ కోసం గాలేరు - నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు రెండవ దశలో 8 నుంచీ 14 వరకూ మొత్తం ఏడు ప్యాకేజీల కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీరందించాల్సి వుంది. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాల్లో 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి వుంది. దీనికోసం ఉమ్మడి కడప జిల్లా నుంచీ శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్ళు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా నీరు రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు చేర్చాలి. అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు, ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచి మిగిలిన రిజర్వాయర్లను కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్ళతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ. 2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. 2008లో మళ్ళీ అంచనాలను రూ. 2526 కోట్లకు సవరించింది. పనులకు అనుమతి ఇచ్చిన నాటి వైఎస్ ప్రభుత్వం పనులు మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో 2014 వరకూ ఆరేళ్ళ పాటు ప్రాజెక్టు మరుగునపడింది.

ప్రాజెక్టుకు ప్రాణం పోసిన చంద్రబాబు

2014లో చంద్రబాబు సీఎం కాగానే సొంత జిల్లాలో మరుగున పడిన గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోశారు. రూ. 2526 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. ఆయన చొరవతో జిల్లా యంత్రాంగం పరుగులు



పెట్టింది. భూసేకరణ పనులు జోరందుకున్నాయి. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట నిర్మాణం, అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్ వరకూ కాలువ తవ్వకం పనులు, మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.18 టీఎంసీలుగా వుండగా దాన్ని 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ. 56.08 కోట్లతో పనులు మొదలు కాగా రూ. 25 కోట్ల పనులు చేశారు. వేణుగోపాల సాగర్ అంచనా వ్యయం రూ. 160 కోట్లు. ఇందులో రూ. 35 కోట్ల పనులు పూర్తయ్యాయి. కాలువతో సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు. ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాక టన్నెళ్ళ నిర్మాణం పెండింగ్ పడింది. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రాలేదు. 2019లో ఎన్నికలు వచ్చేటప్పటికీ గాలేరు-నగరి ప్రాజెక్టు పనుల పురోగతి చాలా ఆశాజనకంగా వుండింది.

చంద్రబాబుపైనే ఆశలు

ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఈ పనులను పూర్తి చేస్తానని, జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఆయనే ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించిన నేపథ్యంలో ఇపుడు తొలి ప్రాధాన్యత కింద ఈ ప్రాజెక్టును ఎంపిక చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు పనులను సమీక్షించి, అవసరమైన అంచనాలు రూపొందించాలని, ఆ మేరకు నిధులు మంజూరు చేసి వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతున్నారు.

జగన్ రాకతో టెండర్లు రద్దు... డిజైన్ మార్పు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి జగన్ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. పనులన్నీ ఆగిపోయాయి. నిధులూ విడుదల కాలేదు. 2020 జూలై 8న ప్రభుత్వం టెండర్లు రద్దు చేసింది. పాత డిజైన్ ప్రకారం పనులు చేపడితే రామచంద్రాపురం మండలంలో ప్రతిపాదిత పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్ల పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుందని, భూముల విలువ విపరీతంగా పెరిగిపోయినందున భూసేకరణ ప్రభుత్వానికి భారమవుతుందన్న వాదన తెరపైకి తెచ్చింది వైసీపీ ప్రభుత్వం. ఆ వంకతో ఆ రెండు రిజర్వాయర్లనూ రద్దు చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని గాలేరు-నగరి కాలువకు మళ్ళించేలా ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూ. 5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో రూపొందించారు. అయితే అప్పటి నుంచీ ఆ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. దీంతో ఐదేళ్ళ పాటు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. మరో వైపు పాత టెండర్లు రద్దయ్యాయి. రీ టెండర్లు పిలవలేదు. డిజైన్ కూడా మార్చివేసినా దానికీ అనుమతులు లేవు. నిధులూ ఇవ్వలేదు. అటవీ శాఖ అనుమతులు కూడా సాధించలేదు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వం గాలేరు-నగరి ప్రాజెక్టు ఊపిరి తీసేసినట్టయింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతిచెందిన రమాదేవి

భాకరాపేట, జూలై 12: భాకరాపేట ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవిఅనే మహిళ మృతి చెందింది. భాకరాపేట ఎస్‌ఐ విజయ కుమార్ నాయక్ కథనం మేరకు... రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ దిగువజూపల్లెకు చెందిన రమాదేవి(36) తన తమ్ముడు శ్రావణ్, కుమార్తె లక్ష్మీశిరతో కలిసి ద్విచక్ర వాహనంలో శుక్రవారం తిరుపతి నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ద్విచక్ర వాహనం చెడిపోవడంతో ఆమె తన తమ్ముడు, కుమార్తెను దానిని తీసుకురమ్మని చెప్పి ఆటోలో బయలుదేరింది. ద్విచక్ర వాహనం తోసుకువస్తున్న వారికి మంచి నీళ్ల బాటిల్ అందించేందుకు ఆటో నుంచి దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వారు హుటాహుటిన భాకరాపేట పీహెచ్‌సీకి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెల్చారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన తల్లిని భాకరాపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు, సిబ్బందిని ఆక్సిజన్ పెట్టమని అభ్యర్థించినా వారు పట్టించుకోలేదని, ఆ తరువాత ఆక్సిజన్ అమర్చినా అది పనిచేయలేదని కుమార్తె లక్ష్మీశిర కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై వైద్యాధికారి అలెగ్జాండర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి తీసుకువచ్చేటప్పటికే రమాదేవి మృతి చెందిందని, ఆ విషయం తాము ఆమె కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. అయినా వారు వినకుండా ఆక్సిజన్ పెట్టమని కోరారని, ఆక్సిజన్ పెట్టినా ఫలితం లేక పోయిందన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతిచెందిన మధుకుమార్

బంగారుపాళ్యం, జూలై 12: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో ఈనెల 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన మధుకుమార్, భరత్‌కుమార్, నాగరాజు ద్విచక్ర వాహనంలో సూళ్లూరుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మొగిలి ఘాట్‌లో అడ్డంగా వచ్చిన అడవి పందులను తప్పించే క్రమంలో వాహనం బోల్తాపడింది. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మధుకుమార్(35) మృతిచెందాడు. ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం సీజ్.. ఒకరి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న మద్యం విక్రేత

శాంతిపురం, జూలై 12 : అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు.. ఎస్‌ఐ తన సిబ్బందితో శుక్రవారం గెసికపల్లె వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. శాంతిపురం మండలం చిన్నకర్లగట్టు గ్రామానికి చెందిన గోవిందరాజులు కర్ణాటక రాష్ట్రం కెంపాపురం నుంచి 15 లీటర్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

రూ. 3.90లక్షల కర్ణాటక మద్యం సీజ్



పుంగనూరు, జూలై12: అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.3,90,256లు విలువైన కర్ణాటక మద్యా న్ని పోలీసులు సీజ్ చేశా రు. పుంగనూరు సీఐ జయరామయ్య కథనం మేరకు.. శుక్రవారం పుంగనూరు సమీపంలోని డాన్ బోస్కో స్కూల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కెఏ01 ఏడి1684 నెంబరు గల కారులో పెద్దపంజాణి మండలం గల్లావారిపల్లెకు చెందిన జగదీశ్(29)మద్యం తరలిస్తుండగా గుర్తించారు. కారుతో పాటు మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.







రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు - మృతి చెందిన పెళ్ళి కుమారుడు బాలు

పెళ్ళి చూపులకు వెళ్ళి వస్తుండగా...

కారు అదుపు తప్పి బోల్తా - యువకుడి మృతి, ముగ్గురికి స్వల్ప గాయాలు

చంద్రగిరి, జూలై 12: పెళ్ళి చూపులకు వెళ్ళి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో పెళ్ళి కుమారుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు బాలు(26) బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే బాలు పెళ్ళి చూపులు కోసమని బాలుతోపాటు సోదరుడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌లు బెంగుళూరులో బుధవారం రాత్రి 9 గంటలకు కారులో బయలుదేరి గురువారం ఉదయం 11.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా, భీమవరం వెళ్ళారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బెంగుళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలోని చంద్రగిరి మండలం, ఎం.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే ఆవు అడ్డం రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెళ్ళి కుమారుడు బాలు తలకు తీవ్ర గాయాలు కాగా, శంకరమ్మ చేయి విరిగింది. దిలీప్, వాసులకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, బాలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్



ఫ్యాక్టరీలో తయారయ్యే పల్ప్‌ల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న మేనేజర్ షమీర్‌శర్మ

గంగాధరనెల్లూరు, జూలై 12: మండలంలోని 100గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. మేనేజర్ షమీర్‌శర్మ ఆయనకు స్వాగతం పలికారు. ప్లాంటుల్లో యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీకి సంబంధించిన అన్ని వివరాలను కలెక్టర్‌కు మేనేజర్ తెలిపారు. ల్యాబ్‌లో బాటిల్స్‌లో నింపి ఉంచిన మామిడి, జామ, చింతపండు, టమాటా, ఉసిరికాయ పల్ప్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీ ఎక్స్‌టెన్షన్ ఇన్‌చార్జి చంద్రకుమార్ పాల్గొన్నారు.

బావిలో పడిన చిన్నారి మృతి



నాని(ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, జూలై 12: మండల పరిధిలోని సరిగప్పకొట్టాలులో బావిలో పడి తీవ్ర గాయాలైన చిన్నారి శుక్రవారం మృతి చెందాడు. సరిగప్పకొటాలు గ్రామానికి కుమార్, సుమ దంపతుల కుమారుడు నాని(3) ఇంటి దగ్గర గురువారం మధ్యాహ్న ఆడుకొంటూ సమీపంలోని బావిలో పడి తీవ్ర గాయాల పాలైన విషయం విదితమే. పీఈఎస్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు బోరుమని విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేంద్రీయ విద్యాలయ కమిషనర్‌కు ఎంపీ లేఖ

చిత్తూరు సిటీ, జూలై 12: చిత్తూరుకు మంజూరైన కేంద్రీయ విద్యాలయను త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కేంద్రానికి లేఖ రాశారు. ఇప్పటికే ఢిల్లీలో ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిసి చిత్తూరులో పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి గురించి లేఖలను అందించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో కేంద్రీయవిద్యాలయసత్సంగ్ కమిషనర్‌కు లేఖ రాశారు. త్వరగా స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు చేయాలని అందులో కోరారు. చిత్తూరు నగరం మంగసముద్రంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు రూ.8.08 ఎకరాల స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే.

శ్రీసిటీ టాటా స్మార్ట్‌ఫుడ్స్ పరిశ్రమకు లీడ్ ప్లాటినం సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 12: శ్రీసిటీలో ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్) ప్రతిష్టాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికెట్ అందుకుంది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిజైన్(ఎల్ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాల్లో అసాధారణ పనితీరు కొలమానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్‌ప్లాటినం సర్టిఫికెట్ సొంతం చేసుకుంది. పర్యావరణ బాధ్యత, పని సామర్థ్యం పట్ల తమ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ పురుషోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు వరించడం పట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి టాటా స్మార్ట్‌ఫుడ్స్ బృందానికి అభినందనలు తెలిపారు.

'కోర్టు కేసులోని భూమికి పాసుపుస్తకాలు ఇచ్చారు'

పెనుమూరు, జూలై 12: పెనుమూరు మండలం కలికిరి సచివాలయ పరిధిలోని ఓబయ్యగారిపల్లిలో ఓ కుటుంబానికి సంబంధించిన తాతల ఆస్తి తమకు తెలియకుండా పాసుపుస్తకాలు ఇచ్చారని యుగంధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తాతల ఆస్తి కుటుంబ పెద్ద శ్రీనివాసులునాయుడు పేరుతో సుమారు 10 ఎకరాల భూమి ఉంది. కుటుంబ వివాదాలతో ఆ భూమిపై కోర్టులో కేసు నడుస్తోంది. అయితే 2020లో అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టులో ఉన్న భూమికి ఎటువంటి మ్యూటేషన్ చేయకుండా శ్రీనివాసులునాయుడు కుమారుడు హేమాచలపతినాయుడు కుటుంబ సభ్యుల పేరుతో ఆన్‌లైన్‌లో వన్‌బీ చేశారు. ఉమ్మడి ఆస్తి, కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఎవరికీ తెలియకుండా అప్పటి తహసీల్దారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వైసీపీ నాయకుల అండతో ఇష్టం వచ్చినట్లు భూములు తారుమారు చేశారు. సమాచారహక్కు చట్టంతో వివరాలు తీసుకుని, పూర్తి ఆధారాలతో స్పందనలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు' అని యుగంధర్ ఆవేదన వ్యక్తంచేశారు. కోర్టులో ఉన్న తమ భూమిపై పూర్తి విచారణ చేసి 15 కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రజా వినతులపై స్పందించాలి : జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 12: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు రెండు గంటలకొకసారి శాఖా పరమైన మెయిల్స్‌ను పరిశీలించి స్పందించాలన్నారు. సీఎం కుప్పం పర్యటనలో వచ్చిన వినతులను పరిష్కరించి, నివేదికను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులను ప్రతినెలా 15వ తేదీలోపు పంపిణీ చేయాలన్నారు. డీఆర్వో పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, డీఎస్వో శంకరన్, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, ట్రాన్స్‌కో ఈఈ హరి, డీఎల్‌డీవో రవికుమార్ పాల్గొన్నారు.

కువైత్‌లో తంబళ్లపల్లె వాసి మృతి


శ్యామ్‌కుమార్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

తంబళ్లపల్లె, జూలై 12: తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని కె.మేకలవారిపల్లెకు చెందిన ఎస్.శ్యామ్‌కుమార్ రెడ్డి(46) బతుకుదెరువు కోసం కువైత్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు..తం బళ్లపల్లె మండలం పరుస తోపు పంచాయతీ కొండకింద మేకలవారిపల్లెకు చెందిన శ్యామ్‌కుమార్‌రెడ్డి, మధుప్రియ దంపతులు 2019లో బతుకు దెరువు కోసం కువైత్‌కు వెళ్లారు. అక్కడ శ్యామ్‌కుమార్‌రెడ్డి పెట్రోలు బంకుల పర్యవేక్షకునిగా పనిచేస్తుండగా భార్య గృహిణిగా ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన శ్యామ్‌కుమార్‌రెడ్డికి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందాడన్నారు. మృతుడి భార్య, కుటుంబసభ్యులు అక్కడే ఉండటంతో ఈ విషయాన్ని కె.మేకలవారిపల్లెలో ఉన్న బంధువులకు ఫోన్ ద్వారా చేరవేశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కువైత్ నుంచి శ్యామ్‌కుమార్‌రెడ్డి మృతదేహం శుక్రవారం సాయంత్రం స్వగ్రామమైన మేకలవారిపల్లెకు చేరుకోగా అంత్యక్రియలు పూర్తి చేశారు.

జింకలు తెచ్చిన తంటా..వ్యక్తికి గాయాలు


గాయపడిన శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, జూలై 12: ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తిని జింకల మంద ఒక్కసారిగా దూకడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ములకలచెరువు మండలం గుడుపల్లెకు చెందిన శ్రీనివాసులు(50) ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా శుక్రవారం ఉదయం మార్గమధ్యంలో ఒక్కసారిగా జింకల మంద రోడ్డు దాటాయి. ఈ క్రమంలో అదే మార్గంలో వస్తున్న శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై జింకలు పడటంతో అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులును మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

రామసముద్రం, జూలై 12: రామసముద్రం మండల కేసీపల్లె పంచాయతీ ఉప్పినెల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఉప్పినెల్లి గ్రామంలోని చెరువుకట్ట మీద పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి పేకాట స్థావనంపై దాడులు నిర్వహించి ఆరుమంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.4820 నగదు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు అమరనాథ రెడ్డి వర్ధంతి

కలికిరి, జూలై 12: మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి తండ్రి దివంగత మాజీ మంత్రి నల్లారి అమరనాథ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. కలికిరి, పీలేరు, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల వద్ద, కేవీ పల్లె మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాస్, కలికిరి మండలంలోని పత్తేగడ క్రాస్ వద్ద వున్న అమరనాథ రెడ్డి విగ్రహాల ముందు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు కలికిరిలో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరై తన తండ్రి విగ్రహాలకు పూల మాలలు వేసి అక్కడే టీడీపీ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించనున్నారు. అనంతరం అన్ని మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొంటారు.

కంకరవేశారు..తారు మరిచారు...

● ఆరు నెలలుగా తిప్పలు పడుతున్న గ్రామస్థులు


కంకర వేసి తారు మరచిన రోడ్డు

నిమ్మనపల్లి, జూలై 12: మండలంలోని కొత్తపల్లి రోడ్డుకు కంకర పరిచి తారు వేయడం మరవడంతో సమీప గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పంచాయతి కొత్తపల్లి- తురకపల్లి మార్గంలో దాదాపు 3కిలోమీటర్ల రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వంలో రూ.98లక్షలతో తారు రోడ్డు మంజూరు చేశారు. దీంతో సంబంధిత అధికారులు 6నెలల క్రితం రోడ్డ పనులు చేపట్టి కంకరు మాత్రం పరిచి తారు వేయక పోవడంతో సమీప గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మూడు కిలోమీటర్లు కంకర రోడ్డుపై వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నామని వాహనాలు అయితే ప్రమాదాలకు గరవుతున్నాయని వాపోతున్నారు. దాదాపు నాలుగు గ్రామాలకు ఇదే మార్గం ద్వారా ఇళ్లకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి సమయంలో గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. దీనికి తోడు గతంలో ఉన్న మట్టిరోడ్డే నయంగా ఉందని వైసీపీ ప్రభుత్వం రోడ్డు వేస్తుందనుకుంటే రోడ్డుపై ముళ్లు పరిచారని ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా రోడ్డుకు తారు వేసి ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మండల మీట్ సజావుగా జరిగేనా...!

గుర్రంకొండ, జూలై 12:గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేశం ఈ మారైనా సజావుగా జరిగేనా అని నాయకులు, ప్రజలు చర్చించుకొంటున్నారు. గుర్రంకొండ ఎంపీపీగా వైసీపీకి చెందిన సీతమ్మ ఉన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ నాయకులు గుర్రంకొండ ఎంపీపీ పదవిని కైవసం చేసుకున్నారు. దీంతో మండల మీట్‌ల్లో వైసీపీ నాయకులు ప్రొటోకాల్ పాటించలేదు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు కాకుండా వారి కుటుంబ సభ్యులు వచ్చి సమావేశాలకు హాజరైన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించారు. ఏ హోదా లేని వ్యక్తులు అధికారులను శాసిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో మండల స్థాయిలో వైసీపీ నాయకులు చడిచప్పుడు లేకుండా ఉండిపోయారు. ఈ క్రమంలో టీడీపీ కూటమి గెలిచిన నెల రోజుల తరువాత గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనుండడంతో సమావేశానికి ఎంపీపీ వస్తారా...? లేదా? అని పట్టణంలో చర్చమొదలైంది. గతంలో సమావేశాలకు హాజరుకానీ టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీలు మండల సమావేశానికి హాజరుకానుండడంతో ఈ మారు మండల మీట్ రసవత్తరంగా ఉంటుందని ప్రజలు చర్చించుకోవడం విశేషం.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు


పొన్నేటిపాళెం గ్రామంలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ నిర్వహణను తనిఖీ చేస్తున్న డీపీవో ధనలక్ష్మి

మదనపల్లె టౌన్, జూలై 12: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవ కాశం ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని పొన్నేటిపాళెం, కురవంక గ్రామాల్లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను డీపీవో పరిశీలించారు. అనంతరం స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో డీపీవో మాట్లాడుతూ మురుగునీటి కాలువలను ప్రతిరోజు శుభ్రపరచాలని, గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. పీఆర్ వన్ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యాలయాల్లో డిజిటల్ రికార్డులు నిర్వహించాలని, అన్ని గ్రామ పంచాయతీల్లో క్లాప్ ప్రోగ్రామ్‌ను సమగ్రంగా నిర్వహించాలన్నారు పట్టణ శివారులోని గ్రామాల్లో అనధికార లేఅవుట్లను గుర్తించి భవనాలకు అప్రూవల్ లేకుంటే కేసులు నమోదు చేయాలన్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నుల బకాయిలను వసూలు చేయడంలో కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించాలి


ఆర్‌బీకే సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ శివశంకర్

మదనపల్లె టౌన్, జూలై 12: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులైన వివిధ పంటల సాగులో పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించాలని మదనపల్లె ఏడీఏ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఈవో కార్యాలయ సమావేశ భవనంలో మదనపల్లె నియోజవర్గానికి చెందిన ఆర్‌బీకే సిబ్బందికి మొక్కలలో పోషకాల ప్రాముఖ్యత, లోప లక్షణాల నివారణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి తోటల పెంపకంలో ప్రతి ఏటా జూన్, జూలై నెలల్లో కొమ్మల కత్తిరింపు చేయాలన్నారు. దీని వలన కొమ్మఎండు తెగులు నివారించవచ్చని, చెట్టు నుంచి రాలిపోయిన మామిడికాయలను తోటకు దూరంగా పారబోయాలన్నారు. దీని వలన ఫ్రూట్‌ఫ్లై తెగులు సోకకుండా మామిడి తోటను కాపడుకోవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్ మాట్లాడుతూ వేరుశనగ సాగులో వశిష్ట రకం విత్తనాలు వేసిన రైతులు 105 రోజుల్లోపు పంటకోత కోయాలని, ఈ సమయం మించితే మొలకలు వస్తాయన్నారు. గడ్డిజాతి తుంగ, వెడల్పాకు, గరిక రాకుండా పెండిమెథాలిన్‌ను నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు హార్టికల్చర్ పథకాల గురించి అడినప్పుడు ఆర్‌బీకే సిబ్బంది నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్చింగ్ ఇస్తారని ప్యాక్ హౌస్, ఫారమ్ పాండ్స్, షేడ్‌నెట్, పెండాల్స్ అడిగే రైతులను తమ కార్యాలయానికి పంపాలన్నారు. సమావేశంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం ఏవోలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వారాహిమాతగా కోర్టులో గంగమ్మ దర్శనం


వారాహిమాతగా కోర్టులోగంగమ్మ

మదనపల్లి అర్బన్ జూన్ 12 : స్థానిక కోర్టులోగంగమ్మతల్లిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారాహిమాత అలంకారణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొల్పి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేషంగా పూజలు చేశారు . రాహుకాల సమ యంలో అధిక సంఖ్యలో మహిళలు ఆలయం చేరుకుని చీర జాకెట్టు, పసుపు కుంకుమలతో పొంగలి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయడు, ట్రెజరర్లు రాటకిండ రంగస్వామినాయుడు, జోలెపాళెం కరునాకర్‌నాయుడు, మార్పూరి మహేష్, మార్పూరి విక్కి, జోలెపాళెం దేవేంద్ర, బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి పర్యవేక్షించారు .

పర్యావరణ హితం కోసం పేపర్ బ్యాగ్‌లు వాడుదాం


వాల్మీకిపురంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వాల్మీకిపురం, జూలై 12: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాగ్‌లు వినియోగించాలని వాల్మీకిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో 35వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ పేపర్ బ్యాగ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వాడకుండా పేపర్‌బ్యాగ్‌లను మాత్రమే వాడాలన్నారు. వాడిన పేపర్ బ్యాగ్‌లను తిరిగి పునఃచక్రియం చేయటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. అలాగే కాటన్ బ్యాగ్స్, జూట్‌బ్యాగ్స్ వాడటం అలవాటు చేసుకోవాలని, మార్కెట్‌కు వెళ్లేముందు తప్పక క్యారీ బ్యాగ్ తీసుకుని వెళ్లడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేక్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

జనం సొమ్ము రాళ్ల పాలు...!

● వృథాగా జగనన్న భూరక్ష రాళ్లు


కాలువపల్లె సచివాలయం ఎదుట ఉన్న జగనన్న భూరక్ష రాళ్లు

ములకలచెరువు, జూలై 12: గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందనడానికి ఈ రాళ్లు నిదర్శనంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకం కింద భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. సర్వే తెలిపి హద్దులు తెలిపేందుకు రాళ్లు నాటాలని నిర్ణయించారు. ఈ రాళ్లపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అని కూడా చెక్కించారు. ఈ రీసర్వేపై రైతుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో పథకం నామమాత్రంగా సాగింది. భూముల హద్దుల్లో నాటేందుకు ప్రజల సొమ్మును వెచ్చించి రాళ్లు కొనుగోలు చేశారు. ఈ రాళ్లు వంద సంఖ్యలో నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని కాలువపల్లె గ్రామ సచివాలయం వద్ద వందలాది రాళ్లు గుట్టలుగా ఉన్నాయి. ఈ రాళ్లను చూస్తున్న పలురువు వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగం చేసిందని చర్చించుకుంటున్నారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు

రాయచోటిటౌన్, జూలై 12: ఈ నెల 24, 25, 26వ తేదీల్లో హార్స్‌లీహిల్స్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత కేశవరావు, హరిప్రసాద్, శేషయ్య, రమణమ్మ, నాగమణి, భరత్‌చంద్ర పాల్గొన్నారు.

పెద్దమండ్యెం ఎస్ఐ, సీఐపై చర్యలు తీసుకోవాలి


మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, జూలై12: పెద్దమండ్యెం ఎస్ఐ, ములకల చెరువు సీఐపై చర్యలు తీసుకోవాలని బాధితులు షేక్ సులేమాన్, షేక్ వాహిదా, షేక్ ఖాదర్‌బాషాలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానక మదనపల్లెలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమండ్యం మండలం, బండ్రేవు పంచాయతీలో మాకు, మా చిన్నాయనకు భూమివిదాలు ఉన్నాయని తెలిపారు. ఏడాదిగా గొడవలు జరుగుతున్నాయని ఈవిషయంగా కొద్దిరోజుల క్రితం మా చిన్నాయన మాతండ్రి అయిన షేక్ ఖాదర్‌బాషాపై కొడవలితో దాడి చేసి గాయపర్చాడాన్నారు. ఈ విషయంగా పెద్దమండ్యెం ఎస్ఐ, ములకలచెరువు సీఐ ఇరువురు హత్యాయత్నం కేసును మాసి వేయడానికి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది ఉండగా తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో సర్టిఫికేట్ తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ విషయంగా మదనపల్లె డీఎస్పీకి ఫిర్యాదు చేసిన మాకు ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉత్తమ గైనకాలజిస్టుగా డాక్టర్ శ్రీలత


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీలత

పీలేరు, జూలై 12: పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా వైద్యురాలు డాక్టర్ శ్రీలత ఉత్తమ గైనకాలజిస్టు అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ శ్రీలతను పీలేరు ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సిబ్బంది అభినందించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం


బార్‌అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌కుమార్, రమణ

వాల్మీకిపురం, జూలై 12: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ,ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా కరీముల్లాబేగ్ వ్యవహరించగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండవ సారి బార్ అధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్ ఎన్నికకాగా ప్రధాన కార్యదర్శిగా జి.రమణ ఉపాధ్యక్షుడిగా మూర్తయ్య, తదితర సభ్యులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు ద్వారకనాథరెడ్డి, రవిప్రకాష్, విభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, చంద్రశేఖర్, అశోక్‌కుమార్‌రెడ్డి, పాల్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, సదాశివరెడ్డి, హరినాథగుప్తా, ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

కురబలకోట, జూలై 12:కురబలకోట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. మండల సమావేశానికి సభ్యులెవరూ హాజరకాకపోవడంతో వాయిదా వేశామన్నారు.

బి.కొత్తకోట బాలికకు స్కేటింగ్ లో గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విద్యార్థిని శ్రీమహాలక్ష్మి

బి.కొత్తకోట, జూలై12: బి.కొత్తకోట పట్టణానికి చెందిన బాలికకు స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ దక్కింది. బెంగళూరు రోడ్డులో నివాసం ఉంటున్న కుంటావుల చంద్రశేఖర్, లలితమ్మల కుమార్తె మోక్షశ్రీ మహాలక్ష్మి విజయవాడలోని పీయం కేంద్రీయ విద్యాలయలో ఆరవ తరగతి చదువుతోంది. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కేంద్రీయ విద్యాసంస్థలకు సంబంధించి నిర్వహించిన హైదరాబాద్ రీజియన్ స్కేటింగ్ పోటీలలో పాల్గొన్న శ్రీమహాలక్ష్మి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ బాలిక విజయవాడ కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయ బృందంతో పాటు, తల్లితండ్రులు అభినందించారు.

పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యసేవలందించండి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్‌బాబు

మదనపల్లె టౌన్, జూలై 12: మదనపల్లె డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో 16 పీహెచ్‌సీ, యూహెచ్‌సీ సెంటర్లు ఉన్నాయన్నారు. వాటిలో మదనపల్లె పట్టణంలోని రామారావుకాలని, త్యాగరాజువీధిలోని యూహెచ్‌సీలు, పీటీఎం మండలం కందుకూరు, వాల్మీకిపురం మండలం నగిరిమడుగు పీహెచ్‌సీలలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని నివేదికలు వచ్చాయన్నారు. ఈ నాలుగు ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు కలసి రోగులను ఆరోగ్యకేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్యులు ఆశా వర్కర్లను అనుసంధానం చేసుకుని రోగులకు వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మోహిత్‌గౌడ్, పీపీ యూనిట్ సూపర్‌వైజర్ మహి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీపీలు రాజీనామా చేయాలి

● ఆందోళనలో టీడీపీ నాయకుల డిమాండ్


ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

కురబలకోట, జూలై 12:మండలంలో జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ దస్తగిరిలు వారి వారి సభ్యత్వానికి రాజీనామాలు చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు టీడీపీ నేత సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సురేంద్రయాదవ్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో జరిగిన బహిరంగ సభలో వైసీపీ నేతలు చేపట్టిని అవినీతిని ప్రశ్నించారని తెలిపారు. అయితే విమర్శలను తట్టుకోలేక ఆయనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడి అధికారంలో ఉన్నప్పుడు తన ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపించారు. వెంటనే వారు చేసిన వ్యాఖ్యలను వెనుక్కు తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. అలాగే లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకులు అంగళ్ల బస్టాండులో బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే సహించేది లేదని టీడీపీ మాజీ కన్వీనర్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమిరెడ్డి, ఎల్లారెడ్డి, అయూబ్‌బాషాలు పాల్గొన్నారు.

బాలికను హత్య చేసిన దుండగులను శిక్షించండి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా సంఘం మహిళలు

మదనపల్లె టౌన్, జూలై 12: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఎనిమిదేళ్ల బాలిక వాసంతిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా సంఘం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలో ఐద్వా మహిళా సంఘాలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ మాట్లాడుతూ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి కనీసం మృతదేహం కనపడకుండా చేసిన వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా, టీవీ సీరియల్లు, సినిమాల్లో మహిళలను అగౌరవపరుస్తూ సన్నివేశాలు ప్రసారాలు చేస్తుండడం వల్ల సమాజానికి ఎంతో నష్టం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వాటిని కట్టడి చేయాలని లేకుంటే ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయడానికి కూడా వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు రెడ్డిప్రసూన, భాను, లక్ష్మీదేవి, రాజమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే ఉరితీయాలి


నిందితులను శిక్షించాలని ఆందోళన చేస్తున్న ఏపీ వాల్మీకి సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 12: బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే ఉరితీయాలని ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మదనపల్లెలో ఆందోళన చేపట్టారు. స్థానిక వాల్మీకి విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం, మచ్చుమరి గ్రామంలో 8 ఏళ్ల చిన్నారి వాసంతిని గ్యాంగ్ రేప్ చేసి పైశాచిక ఆనందంతో హత్య చేసిన వారిని వెంటనే పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక బాలాజీ, వాల్మీకి సంఘం నాయకలు సద్దల జయసింహ, వలసల మంజునాథ, నరసంహులు, నిర్మలమ్మ, పార్వతి, బొంద శ్యామలమ్మ, అర్జున్, సోము, సాకే శ్రీనివాసులు, దేవా, చంద్ర, నారాయణ, జగన్, రాజు, సాంబ, రామకృష్ణ, వెంకటరమణ, గోపాలు, చలపతి, శివ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమిలో ఆక్రమణలు కూల్చివేత


ఆక్రమణలు కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

పీలేరు, జూలై 12: చెరువు భూమిలో జరిగిన ఆక్రమణలు రెవెన్యూ అధికారులు కూల్చివేసిన సంఘటన శుక్రవారం పీలేరులో జరిగింది. పీలేరు మండలం బోడుమల్లువారి పల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.909/4లో ఉన్న కొత్తచెరువుకు చెందిన భూమిలో ఇటీవల కొంత మంది ఆరు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ విషయం తెలుసుకున్న తహసీల్దారు మహబూబ్ బాషా శుక్రవారం మధ్యాహ్నం తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలనూ ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో వీఆర్వో లు వైవీ రమణ, కవిత, రవి, వీఆర్ఏలు మల్లికార్జున, రత్న పాల్గొన్నారు.

చింతపర్తి ఆస్పత్రికి దాతల విరాళం


చింతపర్తి ఆస్పత్రికి మంచాలు వితరణగా అందజేస్తున్న దాతలు

వాల్మీకిపురం, జూలై 12: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు తమ వంతు సాయంగా చేయూతనిచ్చారు. స్థానిక డాక్టర్ శ్రీవిద్య సమక్షంలో రక్త పరీక్షలు నిర్వహించుటకు సెంటర్ ఫీజు, సేపెంట్లు సౌకర్యార్థం చింతపర్తికి చెందిన అలూరి సత్యనారాయణశర్మ దంపతులు ఐసీయూ మంచము వితరణగా అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. దాత అలూరి సత్యనారాయణశర్మ మాట్లాడుతూ ఆస్పత్రికి కావల సిన చిన్న చిన్న పరికరాలు అందజేస్తానని తెలియజెప్పారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు జులేఖబేగం, సనా ఆయేషా, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ఫార్మసిస్ట్ నాగకరుణ, సీహెచ్‌వో ఇందిరారాణి, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, భానుబీ, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ములకలచెరువు, జూలై 12: తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జయచంద్రారెడ్డి కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. అలాగే పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, నాయకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంబళ్లపల్లె, జూలై 12: తంబళ్లపల్లె మండలంలోని తంబళ్లపల్లె, గోపిదిన్నె, కోసువారిపల్లె, కన్నెమడుగు, కుక్కరాజుపల్లె 33/11 కేవి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శేషకుమార్ తెలిపారు. విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30ల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తంబళ్లపల్లె మండల రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.